క్లుప్తంగా

ఘనంగా అనంతభోగేశ్వరుని తిరునాళ్ల



కొల్లూరు : అనంతభోగేశ్వర స్వామి తిరునాళ్ల వేడుకలు కొల్లూరులో ఘనంగా చేపట్టారు. శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి ముగిసిన అనంతరం జరిగే తిరునాళ్ల సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఎదురుగా తిరునాళ్ల సందర్భంగా పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని పురవీధులలో నిర్వహించిన రథోత్సవం భక్తులను ఆకట్టుకుంది.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సత్కారం



భట్టిప్రోలు (కొల్లూరు) : ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో వ్యవహరించి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. భట్టిప్రోలు బీఆర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గొడవర్తి మల్లిఖార్జునరావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు పులి లాజర్, నీలం దేవరాజ్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఉద్యోగ విరమణ పొందుతున్న మల్లిఖార్జునరావు వృత్తి పట్ల అంకిత భావంతో వ్యవహరించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ హుసేన్, ఉపాధ్యాయులు ఆత్మూరి సుబ్బారావు, బొలిశెట్టి మాధవి, విశ్రాంత ఉపాధ్యాయులు కొడాలి లక్ష్మీకాంతరావు, బీవీ రామకోటయ్య, కూచిమంచి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ కీలకం

తెనాలి అర్బన్: వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. తెనాలి పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లతో శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని తన కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి, గుద్దంటి రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, షేక్ రషీద్, నవీద్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- వేరుశనగ పంటలో అవలంబిస్తున్న రైతులు
- స్ప్రింక్లర్లతో నీటి తడులు
- ఆశాజనకంగా వేరుశనగ పంట



ఈదుపల్లిలో వేరుశనగకు స్ప్రింకర్లతో నీటిని అందిస్తున్న దృశ్యం

నగరం: వేరుశనగ సాగులో రైతులు నీటి యాజమాన్య పద్ధతులు అవలంబించి ఆశించిన దిగుబడులు సాధిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను పొందే విధంగా యంత్రాలను వినియోగించుకుంటున్నారు. మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో రైతులు ఆధునిక పద్ధతులు అనుసరిస్తున్నారు. స్ప్రింక్లర్లను వినియోగించి వేరుశనగ పంటకు నీటి తడులను ఇవ్వడం ద్వారా అధిక దిగుబడులను సాధిస్తున్నారు. గతంలో వేరుశనగ పంటకు చిన్న, చిన్న కాల్వలను ఏర్పాటు చేసి 10 నుంచి 15 రోజులకు ఒకతడి నీటిని అందించి సాగు చేసేవారు. అప్పట్లో ఎకరానికి 30 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చేది. ఇప్పుడు నీటి యాజమాన్య పద్ధతులు పాటించడంతో నీటి వృధాను అరికట్టి అధిక దిగబడులు సాధిస్తున్నారు. ఎకరానికి 40 నుంచి 50 బస్తాల వరకు దిగుబడులు సాధిస్తున్నారు.

స్ప్రింక్లర్లతో నీటి తడులు

మండలంలోని ఈదుపల్లి, మీసాలవారిపాలెం, తాడివాకవారిపాలెం, పెదమట్లపూడి, చినమట్లపూడి గ్రామాలలో సుమారు 3 వేల ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట 50 నుంచి 60 రోజుల దశలో ఉంది. ఈ సమయంలో రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల పంట ఆశాజనకంగా ఉంది. వేరుశనగ పంటకు రైతులు పొలాల్లో బోరులు వేసి నీటిని విద్యుత్ మోటార్లతో స్ప్రింక్లర్ల ద్వారా తడులు పెడుతున్నారు. ఎకరానికి 50 నుంచి 60 స్ప్రింక్లర్లను వినియోగించి నీటిని అందిస్తున్నారు. ఒక ఎకరానికి స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సుమారు రూ.లక్ష ఖర్చు చేస్తున్నారు. ఒకసారి వీటిని ఏర్పాటు చేసుకుంటే కొన్ని సంవత్సరాల వరకు వినియోగించుకోవచ్చు. నీటి యాజమాన్య పద్ధతులు అవలంబించి వేరుశనగ సాగుచేయడం వల్ల ఎకరానికి 5 నుంచి 10 బస్తాల దిగుబడి అదనంగా వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

రోజు మార్చి రోజు నీరు



వేరుశనగ పంటకు స్ప్రింక్లర్ల ద్వారా రోజు మార్చి రోజు నీటిని అందిస్తున్నాం. గతంలో కాల్వలతో ఏకతడిని 15 రోజులకొకసారి అందించాం. ఇప్పుడు నీటి యాజమాన్య పద్ధతులు అవలంభించి నీటిని అందించడం వల్ల ఆశించిన దిగుబడులు వస్తున్నాయి.

– పురం శ్రీనివాసరావు, రైతు ఈదుపల్లి

ఆశాజనకంగా ఉంది



రబీ సీజన్‌లో వేరుశనగ పంటను సాగుచేశాం. పంట 60 రోజుల దశలో ఉంది. వేరుశనగ పంటకు నీటిని స్ప్రింక్లర్ల ద్వారా అందిస్తున్నాం. ఎకరం పంట పొలంలో 50 నుంచి 60 స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసి నీటిని పెడుతున్నాం. పంట ఆశాజనకంగా ఉంది.

– కోటయ్య, రైతు, మీసాలవారిపాలెం

నీరు వృథా కాదు



వేరుశనగ పంటకు నీటి యాజమాన్య పద్ధతుల వల్ల ఆశించిన దిగుబడులు వస్తాయి. స్ప్రింక్లర్ల ద్వారా నేల అంతా సమానంగా తడుస్తుంది. కావలసినంత తడి ఇవ్వడం వల్ల మొక్కకు సరిపడే గాలి వస్తుంది. నీరు వృథా కాదు. ఆరుతడి ఇవ్వడం వల్ల దిగుబడి పెరుగుతుంది.

– వి.రమేష్‌బాబు, వ్యవసాయాధికారి, నగరం

బదరీ కేదారేశ్వర ఆలయంలో విశేష పూజలు

కర్లపాలెం: అగ్రహారంలో వేంచేసియున్న గంగా గౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో శివస్వాముల ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. శివమాల ధరించిన స్వాములు 41 రోజుల పాటు చేసిన మండల దీక్ష ముగియటంతో ఆలయంలో దాతల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. తొలుత కేదారేశ్వర స్వామికి అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

తెనాలి అర్బన్: రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ హెచ్చరించారు. స్వరాజ్ టాకీస్ సెంటర్ నుంచి బోసు రోడ్డు వరకు శుక్రవారం ఆయన పర్యటించారు. వ్యాపారులు రోడ్లపై ఆక్రమించి తమ సామగ్రి ఉంచడాన్ని గమనించి, వాటిని తొలగించాలని సూచించారు. ప్రజల సౌకార్యార్థం పట్టణంలో అనేక రోడ్లను అధికారులు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఇకపై వ్యాపారులు రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. టీపీవో సాంబశివరావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



భట్టిప్రోలులో టైలర్స్ డే వేడుకలలో టైలర్లు



కర్లపాలెంలో విలియం హోవే చిత్రపటంతో ర్యాలీ చేసిన దర్జీలు

భట్టిప్రోలు (కొల్లూరు) : టైలర్స్ డేను మండలంలోని దర్జీలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భట్టిప్రోలులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా తొలుత టైలర్స్ దినోత్సవ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కుట్టుమిషన్ సృష్టికర్త ఇలియాస్ హోవె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ, టైలర్ వృత్తిలో కొనసాగుతున్న దర్జీల పరిస్థితి ప్రస్తుతం అత్యంత దుర్భరంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ ఇస్మాయల్, పి.నాగేశ్వరరావు, ఎస్.సుబ్బారావు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో టైలర్స్ డే

కర్లపాలెం: అర్హులైన దర్జీలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కర్లపాలెం మండల ఫ్రెండ్స్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ తెలిపారు. టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం టైలర్లు కర్లపాలెం సెంటర్‌లో తమ అసోసియేషన్ కార్యాలయం వద్ద యూనియన్ జెండా ఆవిష్కరించి కుట్టు మిషన్ కనిపెట్టిన విలియం హోవే చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ టైలర్లను యూనియన్ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్‌కే మౌలాలీ, ఉపాధ్యక్షుడు పఠాన్ సత్తార్, ట్రెజరర్ ఎస్‌కే బాజీ, షేక్ చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



టైలర్స్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

టైలర్స్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

బాపట్ల: టైలర్స్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పట్టణ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె.అల్లాభక్షు పేర్కొన్నారు. బాపట్ల పట్టణ ప్రగతి టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో టైలర్స్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ పతాక ఆవిష్కరణ చేసి టైలర్స్ డే సృష్టికర్త కోట మల్లికార్జునస్వామి, కుట్టు మిషన్ సృష్టికర్త హోవే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాభక్షు మాట్లాడారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా గౌరవ అధ్యక్షుడు అలపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుందర్‌రావు, కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మోదుగుల భాస్కరరావు, టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అస్మత్ వలి, మౌలా సాహెబ్, పొన్నాడ శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు, దర్జీ సోదరీమణులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై మక్కువ పెంచుకోవాలి

కర్లపాలెం: విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై మక్కువ పెంచుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీభార్గవి హైస్కూల్‌లో సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలో నోబెల్ బహుమతి గ్రహీత, శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఆసక్తికరంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో శ్రీభార్గవి హైస్కూల్ చైర్మన్ పేరాల వెంకట సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నగరంలో...

నగరం: సమాజంలో మానవాళి సుఖవంతమైన జీవితానికి సైన్స్ పరిశోధనలే కారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి దేశాభివృద్ధికి తోడ్పాలన్నారు. అనంతరం పొన్నూరు పీబీఎస్ కళాశాల ఫిజిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ కే శ్రీనివాసరావు సమకాలీన పదార్థ విజ్ఞానంలో నానో పదార్థాల నవీన పోకడ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ వెంకటేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటనారయణ, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాల ఏసు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సిటామ్, హెచ్‌ఎం సిస్టర్ సజీవ పాల్గొన్నారు.



సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

సైన్స్ దినోత్సవంలో సూరేపల్లి విద్యార్థుల ప్రతిభ

భట్టిప్రోలు (కొల్లూరు) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో మండలంలోని సూరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబర్చడం హర్షణీయమని హెచ్‌ఎం కూచిబొట్ల శ్రీనివాసశర్మ అన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీలలో తొమ్మిదో తరగతి విద్యార్థి దాసరి అమర్ అభిషిక్త్, 8వ తరగతి విద్యార్థి అరేపల్లి గౌరీమగేశ్వర్‌లు తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, ఉపాధ్యాయులు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

బాపట్లటౌన్‌లో...

బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో ఎస్.నిరంజన్ తెలిపారు. సి.వి.రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎలిమెంటరీ స్కూల్‌లో సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతి పట్టణంలోని రెల్లికాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు చెందిన హర్షవర్ధినీ, ద్వితీయ బహుమతి రామకృష్ణాపురం మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు చెందిన జయప్రమిద, మూడవ బహుమతి అప్పికట్ల ఊర్దూ పాఠశాలలోని ఆయాన్ సాధించారు. శుక్రవారం విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. వీరితోపాటు 3వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్మార్ట్‌వాచీలు, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నిరంజన్, ఎంఈవో–2 ప్రసాదరావు, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఏవీవీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యవతి, సి.వి.రామన్ సైన్స్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.



బాల ఏసు స్కూల్‌లో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు



ప్రథమ బహుమతి సాధించిన హర్షవర్ధినీకి సైకిల్ అందజేస్తున్న ఎంఈవో నిరంజన్

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రవి తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు పలు నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రముఖ శాస్త్రవేత సీవీ రామన్ సైన్స్ ఎఫెక్ట్, రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజున జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించారు. పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రదర్శనలను సైన్సు ఉపాధ్యాయులు ఆనంద్, ఆదినారాయణ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో మీ సేవలు అభినందనీయం

జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



పదవీ విరమణ చేసిన సిబ్బందితో జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్లటౌన్: పోలీస్ శాఖలో 30 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ సేవలు అందించడం హర్షణీయమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఇద్దరు పోలీస్ అధికారులను శుక్రవారం సన్మానించారు. అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలంపాటు విశేష సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవీ విరమణ చేసిన వారిలో... బాపట్ల డీపీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముఖ్వ సాయిబాబా 1993లో ఆఫీస్ సబార్డినేట్‌గా పోలీస్ శాఖలోకి ప్రవేశించి ఒంగోలు పీటీసీ, డీపీఓ కార్యాలయాల్లో విధులు నిర్వహించారు. 32 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించి జూనియర్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ చేశారన్నారు. బాపట్ల ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పాతూరి వీరస్వామి 1991లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలోకి ప్రవేశించారన్నారు. హైదరాబాద్ ఫస్ట్ బెటాలియన్‌లో విధులు నిర్వహించి కన్వర్షన్‌పై ఒంగోలులోని ఏఆర్ విభాగానికి బదిలీ అయ్యారన్నారు. బాపట్ల జిల్లా ఏఆర్ విభాగానికి బదిలీపై వచ్చారన్నారు. 34 సంవత్సరాలు విశేష సేవలు అందించి హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ చేశారన్నారు. ఏవో శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ విజయ సారధి, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తెనాలి రూరల్: గుంటూరుకు చెందిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సహకారంతో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొలకలూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక ఏబీఎం చర్చి వద్ద జగ్జీవన్‌రామ్ రీడింగ్ రూమ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

జూద క్రీడలకు అడ్డాగా రే‘పల్లె’

- నియోజకవర్గంలో విచ్చలవిడిగా జూద శిబిరాలు
- పదికి పైగా పేకాట శిబిరాలు
- గ్రామాలలో కోడి పందేలు

రేపల్లె రూరల్: నియోజకవర్గం జూద క్రీడలకు అడ్డాగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారపార్టీకి చెందిన ముఖ్యనేతల అనుచరులు జూద క్రీడల సాంప్రదాయాలకు తెరతీశారు. పేకాటను ఆదాయ వనరుగా చేసుకున్న నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులకు పేకాట స్థావరాలు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. పేకాటతో పాటు కోడి పందేల నిర్వహణ పెద్దఎత్తున జరుగుతున్నాయని, స్వయానా మంత్రి సోదరుడు కనుసన్నలలో విచ్చలవిడిగా జూదక్రీడలు పురుడు పోసుకున్నాయని సొంత పార్టీ నేతలే బహిరంగంగా మాట్లాడుకోవటం విశేషం. నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లె మండలాలలో 15కుపైగా జూదకేంద్రాలు నడుస్తున్నాయంటే ఏ స్థాయిలో జూదం ఉందో అర్థం చేసుకోవచ్చు. శని, ఆదివారాలు వచ్చాయంటే నిజాంపట్నం మండలంలో గ్రామ గ్రామాన కోడి పందేల శిబిరాలు వెలుస్తున్నాయి.

తిలాపాపం... తలాపిడికెడు...

టీడీపీ నాయకులతో పాటు కూటమిలో భాగస్వాములైన కొంత మంది జనసేన, బీజేపీ నాయకులు జూద కేంద్రాల పాపాలలో పాలుపంచుకుంటున్నారు. బీజేపీ పార్టీకి చెందిన ఓ నేతకు పేకాట, కోడి పందేల నిర్వాహకులపై నోరు మెదపకుండా ఉండేందుకు అక్షరాలా నెలకు రూ.30 వేలు అందజేస్తున్నారని జోష్‌గా ప్రచారం జరుగుతుంది. నిన్న మొన్నటి వరకు జూద కేంద్రాలపై డీజీపీ, ఎస్పీలకు ఫిర్యాదులు చేస్తానని ఉగ్రూతలూగిన ఈ నేత ప్రస్తుతం తనకేమీపట్టనట్లు ఉండటంతో ఆరోపణలకు బలం చేకూరుతున్నాయి. చెరుకుపల్లి, రేపల్లె పట్టణంలో జరుగుతున్న పేకాట శిబిరాలలో జనసేన నాయకులు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ పేకాట నిర్వాహకుడు అధికారులను, నాయకులను ప్రసన్నం చేసుకుంటూ కొంతకాలంగా నగరం మండలంలోని సపోటా తోటలో పేకాట స్థావరాన్ని నడిపాడు. పంపకాలలో విభేదాలు రావటంతో నగరంలో పేకాట శిబిరాలను ఆపారు. అనంతరం తమ పేకాట విడిదిని మొర్తోట కష్టా నది పాయలో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం పట్టణంలోని ఉప్పుడి పంచాయితీలో ఉన్న ఓ ప్రైవేటు వెంచర్లో యదేచ్ఛగ రాత్రి, పగలు పేకాట స్థావరాన్ని నడిపిస్తున్నారని పట్టణంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్య నేత ప్రధాన అనుచరుడిగా చలామణి అవుతున్న ఓ వ్యక్తి అన్నీ తానై శిబిరాలను నిర్వహిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నాడని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి జూద శిబిరాలను కట్టడి చేయాలని నియోజకవర్గ ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో రాణించాలి

రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ అవర్ణ

రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లోనూ రాణించాలని రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అధునాతన సాంకేతిక రంగంలో విద్యను ప్రయోగపూర్వకంగా చదివితే ఆ జ్ఞానం పదికాలాలపాటు ఉంటుందన్నారు. ప్రయోగాలు నిర్వహించటంతో విజ్ఞానం అర్థం చేసుకోవటమే కాకుండా విద్యార్థులకు స్నేహపూరిత వాతావరణం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఆటోమేటిక్ స్ట్రీట్‌లైట్ సిస్టమ్, ఇరిగేషన్, ఆటోమేటిక్ ఫైర్ స్టాపర్, ఎలక్ట్రికల్ లిఫ్ట్ వంటి పలు ప్రదర్శనలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న కరస్పాండెంట్ అవర్ణ